సాక్షి నిజామాబాద్

7

సోమవారం | 6 | ఫిబ్రవరి | 2023



ఖిల్లా డిచ్‌పల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌రీల్

నేడు తెయూలో కేంద్ర బడ్జెట్‌పై చర్చాగోష్ఠి

తెయూ(డిచ్‌పల్లి): స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో 2023 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై చర్చాగోష్ఠి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెయూ మెయిన్ క్యాంపస్‌లోని బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు చర్చాగోష్ఠి ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ రవీందర్, గౌరవ అతిథిగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, విశిష్ట అతిథిగా ప్రిన్సిపాల్ ఆరతి, ముఖ్యవక్తగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకకు చెందిన ప్రముఖ ఆర్థిక రంగ నిపుణులు, స్వదేశీ జాగరణ మంచ్ దక్షిణ మధ్య భారత్ సహ సంయోజక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్తు లింగమూర్తి హాజరవుతారని వారు తెలిపారు. చర్చాగోష్ఠిలో వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు



సుభాష్‌నగర్: జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్‌ను బీజేవైఎం నాయకులు ఆదివారం ఢిల్లీలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురితో కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌కు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, తదితర సమస్యలు విన్నవించేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకుని లాఠీచార్జ్ చేశారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేగాకుండా అసభ్యపదజాలంతో దూషించారని, అక్రమంగా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని.. పోలీసులపై ఫిర్యాదు చేసినట్లు బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్ తెలిపారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు ఉన్నారు.

కరెంట్ బిల్లు రూ. 1,77,970

- బిత్తర పోయిన వినియోగదారుడు



నందిపేట్(ఆర్మూర్): తడిసి మోపెడవుతున్న వేల రూపాయల కరెంట్ బిల్లులతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. విద్యుత్తు అధికారుల తీరుతో మరింత ఇబ్బందుల కు గురవుతున్నారు. నందిపేటలోని నందివాడలో గల సయ్యద్ యూనస్ ఇంటికి 1,77,970 రూపాయల కరెంట్ బిల్లు రా వడంతో బిత్తరపోయాడు. సర్వీస్ నంబరు 50950–0395 గల కరెంట్ మీటరుకు 30 రోజుల వ్యవధిలో 17,823 యూనిట్లు కాల్చినట్లు రికార్డు చేసి, ఇందుకుగాను కరెంట్ చార్జీల కింద రూ. 1,76,720 ఎనర్జీ చార్జీ కింద 160, కస్టమర్ చార్జీ కింద రూ. 1,069ల తో పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ కలుపుకుని రూ. 1,77,970 బిల్లు వేశారు. లక్షల రూపాయల బిల్లు రావడంపై అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

హైందవ సంక్షేమమే భారత సంక్షేమం



సుభాష్‌నగర్ : హైందవ సంక్షేమమే భారత దేశం సంక్షేమమని భావించిన డాక్టర్ హెడ్గేవార్ సందేశాన్ని గ్రామగ్రామాన చేరవేస్తున్నామని ధర్మ జాగరణ ప్రాంత ప్రముఖ్ బొడ్డు సురేందర్ తెలిపారు. ఆదివారం నగరంలోని అభ్యాస పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌ఎస్‌ఎస్) మహారాణ ప్రతాప్ శాఖ వార్షికోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు పథ సంచలన్, కర్రసాము, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాన్ని విశ్వగురువుగా నిలిపే ప్రయత్నం ఆర్‌ఎస్‌ఎస్ చేస్తోందన్నారు. వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా దేశవ్యాప్తంగా సంఘం శాఖలు నిర్వహిస్తోందని, వివిధ రకాల సేవాకార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. 2025లో సంఘం శత జయంతి ఉత్సవాలు జరుపుకోవాలని, ప్రతి ఇంటికి చేరుకునే విధంగా ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నగర సంఘ్ చాలక్ తిరుక్కోవల్లూర్ శ్రీనివాస్, నగర కార్యవాహ గంగా నర్సయ్య పాల్గొన్నారు.

పెరిగిన పంటల సాగు

- గతేడాదితో పోలిస్తే యాసంగి విస్తీర్ణంలో పెరుగుదల
- భారీగా సాగైన వరి, మక్క, శనగ
- 'ఆరుతడి'పై ఆసక్తి చూపని రైతులు
- మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడమే కారణం



నందిపేట్ మండలం బజార్‌కొత్తూర్ శివారులో సాగవుతున్న వరి

ఇందూరు/డిచ్‌పల్లి: ఈ ఏడాది యాసంగి(ఎండాకాలం) సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కొంతమేర పెరిగింది. గతేడాదితో పోలిస్తే రైతులు వరి, మొక్కజొన్న, శనగలను ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. మరో వైపు ఆరుతడి పంటల జోలికి పోలేదు. దీంతో ఆరుతడి సాగు విస్తీర్ణం పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం యాసంగిలో అన్నిరకాల పంటలు కలిపి 4,71,542 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, 4,96,279 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గతేడాది ఈ సీజన్‌తో పోలిస్తే 5,388 ఎకరాల మేర పెరిగింది. వర్షాకాలంలో వానలు సమృద్ధిగా కురవడంతో జలాశయాలు, చెరువులు కుంటలు నిండుకున్నాయి. దీంతో వరి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టుల నుంచి పంటలకు సాగునీరు విడుదల కావడంతో పంటలు కళకళల్లాడుతున్నాయి.

తగ్గిన ఆరుతడి సాగు

వరి, మక్క, శనగ పంటలకు డిమాండ్ ఉండడంతో మార్కెట్‌లో మంచి ధర వస్తోంది. దీంతో అత్యధికంగా ఇవే పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది ఆరుతడి పంటల సాగుకు ఆసక్తి కనబర్చడం లేదు. తద్వారా ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. జొన్నలు, పప్పుదినుసులు, పొద్దు తిరుగుడు, వేరుశనగ, నువ్వుల పంటలు క్షీణించాయి. మార్కెట్‌లో ఆరుతడి పంటల ధరలు నిలకడగా లేకపోవడంతో పాటు ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడం కూడా పంటలు సాగు చేయకపోవడానికి కారణమని చెప్పవచ్చు. అలవాటుగా సులభంగా చేతికొచ్చే వరి, మక్క పంటలను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

గతేదాది, ప్రస్తుతం సాగవుతున్న ముఖ్యమైన పంటలు (ఎకరాల్లో..)

పంట రకం	2021-22	2022-23
వరి	3,46,672	3,85,865
గోధుమలు	230	71
తెల్లజొన్నలు	1,812	576
మొక్కజొన్న	12,493	26,781
శనగ	23,840	23,928
పెసర్లు	300	31
మినుములు	1,210	448
వేరుశనగ	1,835	182
నువ్వులు	14,979	425
పొద్దు తిరుగుడు	16,124	5,541
గడ్డిజొన్న	39,702	29,961

అంచనాలను మించి..

వరి పంట గతేడాదితో పోలిస్తే ఎక్కువ సాగైంది. ఈ ఏడాది యాసంగిలో 3,67,739 ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇప్పటి వరకు 3.86లక్షల ఎకరాల్లో రైతులు పంటలను వేశారు. అంచనా కంటే దాదాపు 40వేల ఎకరాల్లో విస్తీర్ణం పెరిగింది. అదే విధంగా ఖరీఫ్‌లో మొక్కజొన్నకు మార్కెట్‌లో ధర ఎక్కువ రావడంతో రైతులు ధైర్యం చేసి యాసంగిలో కూడా మొక్కజొన్నను గతేడాది కంటే ఎక్కువగా సాగు చేశారు. 19,745 ఎకరాల్లో మక్క సాగవుతుందని అంచనా ఉంటే 26,781 ఎకరాల్లో సాగైంది. అంచనా కంటే 14,228 ఎకరాలు పెరిగింది. అలాగే శనగ పంట సాగు సైతం అంచనా కంటే 88 ఎకరాలు పెరిగింది.

ప్రత్యామ్నాయ పంటలు వేయాలి



ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సులభంగా చేతికొచ్చే వరి పంటనే సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలైన పప్పుదినుసులు, కూరగాయలు, ఇతర పంటలను కూడా సాగుచేయాలి. మార్కెట్‌లో మంచి ధర వచ్చే పంటలు చాలా ఉన్నాయి. రైతులు మార్పు తెచ్చుకుని లాభదాయకమైన ఇతర పంటలు సాగు చేయడానికి ప్రయత్నం చేయాలి.

– ఆర్.తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ఘనంగా రథోత్సవం..

- వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- భారీగా తరలివచ్చిన భక్తులు

డిచ్‌పల్లి: రామ నామస్మరణతో ఖిల్లా డిచ్‌పల్లి పులకించిపోయింది. రామాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా ఆదివారం రాత్రి శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ఆలయ అర్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే, అశ్లేష కృష్ణమాచార్యులు, ప్రదీప్ శర్మ దేశ్ పాండే, ప్రవీణ్ దేశ్‌పాండే, పూజారులు సుమారు రెండు గంటల పాటు రథహోమం, బలిహరణం పూజా కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవంలో టీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీతారాములకు ప్రత్యే క పూజలు నిర్వహించారు. రాత్రి పది గంటలకు ప్రారంభమైన రథోత్సవం అర్ధరాత్రి రెండు గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్, ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ దాసరి ఇందిర లక్ష్మీనర్సయ్య, సర్పంచ్ గడ్డం రాధాకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొత్తూరు మానస, డీసీసీబీ డైరెక్టర్ గజవాడ జైపాల్, ఉప సర్పంచ్ ఆనది రవీందర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

ఆలయాల అభివృద్ధికి కృషి

- కేంద్ర హోంమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి రాజారాం హల్దే

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని కేంద్ర హోంమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి రాజారాం హల్దే, ఆయన సతీమణి యూనివర్సల్ గ్రూప్ స్కూల్ చైర్మన్ పార్వతి పేర్కొన్నారు. ఆదివారం ఖిల్లా రామాలయం, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేలా చేయడానికి గ్రామస్తులు 35 శాతం నిధులు కాంట్రిబ్యూట్ చేస్తే కేంద్రం నుంచి 65 శాతం నిధులు మంజూరయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధానార్చకులు రవికుమార్ వడియాల్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న రాజారాం హల్దే దంపతులు

నాందేడ్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



నాందేడ్ సభకు వెళ్తున్న రెంజల్ మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

బోధన్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ ఎమ్మెల్యేజీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌లతో పాటు ఇతర ముఖ్య నేతలు సభలో పాల్గొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని బోధన్, బాన్సువాడ, జుక్కల్, కోటగిరి, రెంజల్, నవీపేట, ఎడపల్లి, నిజామాబాద్ అర్బన్ ప్రాంతాల నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో సభకు తరలివెళ్లారు. ఒక్క బోధన్ నియోజవర్గం నుంచే 300లకు పైగా సుమోల్లో పార్టీ మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలారు. బోధన్ డివిజన్ పరిధిలోని మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రోడ్లు నాందేడ్‌కు సభకు వెళ్లిన వాహనాల రాకపోకలతో సందడిగా మారాయి. పార్టీలో చేరిన వారికి సీఎం కేసీఆర్, మహిళలకు ఎమ్మెల్సీ కవితలు కండువాలు కప్పి ఆహ్వానించారు. కేసీఆర్ వెంట వచ్చారు.



సభలో పాల్గొన్న ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ కవిత

ఫలించిన నాయకుల కసరత్తు

నాందేడ్ సభకు సక్సెస్ చేసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు చేసిన కసరత్తు ఫలించింది. భారీస్థాయిలో కార్యకర్తలను సభకు తరలించారు. ఎంపీపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే షకీల్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు తదితరులు అక్కడే మకాం వేసి సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎట్టకేలకు పెరిగిన గౌరవ వేతనం

- మధ్యాహ్న ఏజెన్సీలకు శుభవార్త చెప్పిన సర్కారు
- రూ. వెయ్యి నుంచి రూ. 3వేలకు పెంపు

మోర్తాడ్(బాల్కొండ): పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే ఏజెన్సీలకు ఎట్టకేలకు గౌరవ వేతనం పెంచుతూ పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులను జారీ చేశారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు నెలకు రూ. వెయ్యి ఉన్న వేతనాన్ని రూ. 3వేలకు పెంచుతూ సీఎం కేసీఆర్ గత బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించారు. ఇంత వరకు ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఏజెన్సీ నిర్వాహకులకు వేతనం పెంపు అమలు కాలేదు. పీఎం పోషణ పథకం కింద మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గౌరవ వేతనంగా కేంద్రం రూ. 600లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.400లు చెల్లించేది. మెస్ చార్జీలు తక్కువగా ఉండడంతో భోజనం వండిపెట్టడం తమకు గిట్టుబాటు కావడం లేదని ఏజెన్సీలు గతంలో ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ ఏజెన్సీల నిర్వాహకులకు నెలకు రూ. 3వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చింది. గత మార్చిలో హామీ ఇవ్వగా ఇప్పుడు ఉత్తర్వులను జారీచేయడం గమనార్హం. ఇక నుంచి కేంద్రం తన వంతు వాటాగా రూ. 600లను, రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,400లను గౌరవ వేతనంగా చెల్లించనుంది. ఇదిలా ఉండగా ఏజెన్సీలకు గౌరవ వేతనం బకాయిలు బాగానే చెల్లించాల్సి ఉంది. పెంచిన గౌరవ వేతనంతో పాటు బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని ఏజెన్సీల నిర్వాహకులు కోరారు. ఏజెన్సీలకు గౌరవ వేతనం పెరగడంతో జిల్లాలోని 1,226 ఏజెన్సీలకు లబ్ధి చేకూరనుంది.



మోర్తాడ్‌లోని ఉన్నత పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ఉత్తర తిరుపతి క్షేత్రాన్ని దర్శించుకున్న సీఎస్





ఉత్తర తిరుపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సీఎస్ శాంతి కుమారి, కమిషనర్ యోగితా రాణా

నిజామాబాద్‌సిటీ/ఇందూరు : జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌లో గల ఉత్తర తిరుపతి క్షేత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతి కుమారి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎస్ వెంట ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్ యోగితారాణా కూడా వచ్చారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ అనఘా సంపత్ సీఎస్‌కు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు.

గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న మనోళ్లు

- ప్రపంచవ్యాప్తంగా 82 దేశాల్లో 8,343 మంది ఖైదు
- ఆరు గల్ఫ్ దేశాల్లోనే 4,755 మంది నేరస్తులుగా ముద్ర
- పరస్పర ఖైదీల బదిలీ ఒప్పందాలున్నా అమలుకు నోచుకోని వైనం



మోర్తాడ్(బాల్కొండ): ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన మన దేశస్తులు పరాయి దేశాల చట్టాలపై అవగాహన లేక చేసిన చిన్నచిన్న తప్పులకు ఆయా దేశాల జైళ్లలోనే మగ్గిపోతున్నారు. రాయబార కార్యాలయాల ద్వారా న్యాయసాయం పొందే అవకాశాలు తక్కువగా ఉండడంతో ఏళ్ల తరబడి జైలు పక్షులుగానే ఉండిపోతున్నారు. విదేశీ జైళ్లలో ఉన్న భారతీయుల సంఖ్య, వారికి అందుతున్న న్యాయ సహాయంపై పలువురు ఎంపీలు పార్లమెంట్‌లో చర్చ లేవనెత్తారు. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ ఇచ్చిన సమాధానం ప్రకారం 82 దేశాల్లో అండర్ ట్రయల్ ఖైదీలతో పాటు వివిధ కేసుల్లో శిక్షపడి జైళ్లలో ఉన్న భారతీయుల సంఖ్య 8,343 మంది అని తేలింది. ఇందులో 4,755 మంది కేవలం ఆరు గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో బంధించబడి ఉన్నారు. ఆరు దేశాల జైళ్లలో ఉన్న భారతీయులతో పోలిస్తే ఇతర 76 దేశాల జైళ్లలో ఉన్న వారి సంఖ్య తక్కువగా ఉంది. గల్ఫ్ దేశాలతో పాటు మలేషియా జైళ్లలోనూ భారతీయులు ఎక్కువగానే ఉన్నారు. అంటే కేవలం ఉపాధి కోసం వెళ్లినవారు వీసా నిబంధనలను అతిక్రమించి జైలు పాలైనట్లు వెల్లడవుతుంది. కంపెనీల వీసాలపై వెళ్లి ఆ కంపెనీల్లో పని నచ్చకపోతే కల్లివెల్లి కార్మికులుగా మారి పనిచేయడం చివరకు పోలీసులకు దొరికిపోవడంతో జైలు పాలయ్యారు. మరికొందరు విజిట్ వీసాలపై వెళ్లి వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోవడంతో కటకటాల పాలయ్యారు. ఇదిలా ఉండగా 31 దేశాలతో శిక్షార్హమైన వ్యక్తుల బదిలీపై మన విదేశాంగ శాఖ ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇందులో గల్ఫ్ దేశాల్లోని ఒమాన్ మినహా మిగిలిన ఐదు దేశాలున్నాయి. అయినా ఖైదు చేయబడ్డ భారతీయులకు విముక్తి లభించడం లేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి వివిధ దేశాల్లోని జైల్‌లో మగ్గుతున్న భారతీయులను మాతృదేశానికి చేర్పించాలని పలువురు కోరుతున్నారు.

విదేశాంగ శాఖ వెల్లడించిన వివరాలు

దేశం	ఖైదీలు		
యూఏఈ	1,926	బహ్రెయిన్	265
సౌదీ	1,362	ఒమన్	92
ఖతర్	682	మలేషియా	606
కువైట్	428	ఇతర దేశాలు	2,982
		మొత్తం	8,343

న్యాయసాయం అందించాలి



గల్ఫ్ దేశాల్లో అండర్ ట్రయల్ ఖైదీలతో పాటు శిక్షపడిన ఖైదీల సంఖ్యను కేంద్రం వెల్లడించిన సంఖ్య కన్నా ఎక్కువ మందే జైళ్లలో ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన మరో ఐదువేల మంది ఔట్ జైళ్లలో ఉన్నారని సమాచారం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయసాయం అందించాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

సమాజహితమే గురుకులాల లక్ష్యం

- శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద
- కామారెడ్డి ఆర్ష గురుకులంలో ముగిసిన యోగా సాధన శిబిరం

కామారెడ్డి అర్బన్ : సమాజహితమే ఆర్ష గురుకులం లక్ష్యమని స్వామి పరిపూర్ణానంద పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేట ఆర్ష గురుకులం బ్రహ్మ మహా విద్యాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 40వ యోగా సాధన శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో గురుకులం పూర్వ విద్యార్థి, శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ఆర్ష గురుకులంలో ఏటా యోగా, ధాన్య శిబిరాలు నిర్వహిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. యోగా, ధ్యానాలలో ఎంతో శక్తి ఉందని, సాధకులను ఉన్నతులను చేస్తాయని పేర్కొన్నారు. సమాజ హితం కోసం కృషి చేస్తున్న ఆర్ష గురుకులాలకు చేయూతనివ్వాలని ప్రజలను కోరారు. ఆరోగ్యకర జీవితానికి గోమాత, భూమి అనుసంధాన వ్యవసాయం అవసరమన్నారు. ఆర్య సమాజ్ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ మహర్షి బోధనలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మహిళలను గౌరవించడం మంచి సమాజ లక్షణమని గురుకులం మీమాంసక్ బ్రహ్మానంద సరస్వతి పేర్కొన్నారు. ఆర్య సమాజ్ వ్యవస్థాపకులు స్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల(1824–2024)ను పురస్కరించుకుని ప్రత్యేక ఫ్లెక్సీని ఆవిష్కరించారు. యోగా, ధ్యానం శిక్షణ పొందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సాధకులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఆచార్య సందీప్, ముముక్షు, సిద్ధిరాములు, వేదమిత్ర, సబిత, మర్రి కృష్ణారెడ్డి, కృష్ణానందస్వామి, అర్గుపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామి పరిపూర్ణానంద

క్లుప్తంగా

'చదువు' పుస్తకం ఆవిష్కరణ



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన విద్యార్థిని డేగల వైష్ణవి రచించిన చదువు సరళ వచన శతకం పుస్తకాన్ని ఆదివారం తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్‌లో బాల సాహిత్య సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమంలో వైష్ణవి రచించిన పుస్తకం ఆవిష్కరించారు. అతిథులు మాట్లాడుతూ చదువు గురించి విద్యార్థిని అద్భుతమైన రచన చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో బయోటెక్ ట్రస్ట్ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, వేదకుమార్, రంగినేని మోహన్‌రావు, మాడభూషి లలితాదేవి, గరిపెల్లి అశోక్, డాక్టర్ పత్తిపాక మోహన్, తడపాకల్ తెలుగు పండిత్ ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి



సుభాష్‌నగర్:బీసీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడ లోగల బీసీ వసతిగృహాన్ని ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల ఆత్మబలిదానాలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్.. వారి జీవితాలను చీకట్లలో నింపుతున్నారని ఆరోపించారు. బీసీ మంత్రి గంగుల కమలాకర్ బీసీ హాస్టళ్లను సందర్శించాలని డిమాండ్‌చేశారు. నాయకులు నారాయణ యాదవ్, యెండల సుధాకర్, శ్రీనివాస్ శర్మ, మారుతి శ్రీనివాస్, రాజప్రసాద్, రాహుల్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



బోధన్: నిరుపేదల ఆరోగ్యం, ఆపదలో ఉన్న వారి ప్రాణ రక్షణ కోసం ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ కొనియాడారు. ఆదివారం పట్టణంలోని గంజ్ ప్రాంతంలో గల ఆర్‌టీసీ కాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆరోగ్య జ్యోతి మాట్లాడు తూ బోధన్, నిజామాబాద్, బాన్సువాడ ప్రభుత్వాస్పత్రులకు బ్లడ్ యూనిట్లను అందించేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో కొన్నేళ్ల నుంచి ప్రతి ఏటా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో 180 మంది రక్తదానం చేశారు. సత్యం, చక్రవర్తి, డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

జీపీవర్కర్స్ రాష్ట్ర మహాసభలు



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి అరుంధతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను నిర్వహించారు. హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి మాధవరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. జీపీ కార్మికులను పర్మినెంట్ చేసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భూమయ్య, తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ, వెంకన్న, గంగాధర్ పాల్గొన్నారు.

బడి నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

- నిలిచిన నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవనం పనులు
- ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న వైనం



కామారెడ్డి పట్టణ సమీపంలో ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న గురుకుల పాఠశాల



గోపాల్‌పేటలో నిలిచిన గురుకుల పాఠశాల భవనం పనులు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలానికి మంజూరైన గిరిజన బాలుర గురుకుల పాఠశాలకు పక్కా భవన నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. పనులు ప్రారంభించిన ప్రతీసారి ఏదో ఒక ఆటంకం కలిగి నిలిచిపోతున్నాయి. ఫలితంగా పాఠశాల ఏర్పాటైనప్పటి నుంచి పలుచోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతోంది. నాగిరెడ్డిపేట మండలంలో సరైన సదుపాయాలతో భవనం అందుబాటులో లేకపోవడంతో గత నాలుగేళ్లకుపైగా కామారెడ్డి పట్టణ సమీపంలోని ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది.

2016లో పాఠశాల మంజూరు

నాగిరెడ్డిపేట మండలానికి 2016లో గిరిజన బాలుర గురుకుల పాఠశాల మంజూరయింది. అప్పట్లో మండలకేంద్రం గోపాల్‌పేటలోని ఓ అద్దె భవనంలో పాఠశాలను ప్రారంభించారు. ఏడాది పాటు మండలకేంద్రంలో పాఠశాల సజావుగా సాగింది. తర్వాత విద్యార్థుల సంఖ్య పెరగడంతో సరైన వసతులు కలిగిన భవనం మండల కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో పాఠశాలను మండలంలోని మాల్తుమ్మెదలోని మరో ప్రైవేట్ భవనంలోకి మార్చారు. కాగా మాల్తుమ్మెదలోని ప్రైవేట్ భవనంలోనూ విద్యార్థులకు సరిపడా వసతులు లేక వారు అనేక ఇబ్బందులు పడ్డారు. రెండేళ్ల తర్వాత తప్పనిసరైన పరిస్థితులలో పాఠశాలను కామారెడ్డి పట్టణం సమీపంలోని సరంపల్లి వద్ద గల ప్రైవేట్ భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి సుమారు నాలుగేళ్లుగా నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవనం అక్కడే కొనసాగుతుంది.

పక్కా భవన నిర్మాణానికి అడ్డంకులు

గురుకుల పాఠశాలకు పక్కా భవన నిర్మాణానికి ఆది నుంచి అవాంతరాలే ఎదురవుతున్నాయి. పాఠశాలకు సొంత భవన నిర్మాణం కోసం నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని రామాలయం ఎదురుగా ఉన్న సర్వే నం.509లో 7ఎకరాల 13 గుంటల భూమిని మూడేళ్ల క్రితం ప్రభుత్వం కేటాయించింది. పాఠశాల భవన నిర్మాణం కోసం రూ.4.40కోట్ల నిధులను సైతం మంజూరు చేశారు. కాగా ఈ స్థలాన్ని అంతకుముందు ప్రభుత్వం రైతులకు కేటాయించడంతో వివాదం నెలకొంది. దీంతో బాధిత రైతులు పాఠశాలకు కేటాయించిన స్థలంపై కోర్టులో కేసు వేశారు. అప్పట్లో పాఠశాల సొంత భవన నిర్మాణం పనులకు అదిలోనే ఆటంకం కలిగింది. ఆరునెలల క్రితం అదే స్థలంలో సంబంధిత కాంట్రాక్టర్ పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కాగా మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ, రుద్రూర్ వరకు ఉన్న రహదారిని ప్రభుత్వం జాతీయ రహదారిగా గుర్తించింది. దీంతో ఇటీవల నేషనల్ హైవే అథారిటీ అధికారులు రహదారి విస్తరణ కోసం సర్వే చేపట్టారు. సర్వేలో రోడ్డు విస్తరణ ప్రస్తుతం నిర్మిస్తున్న పాఠశాల భవనం వరకు జరుగుతుందని, ఈ క్రమంలో ప్రస్తుతం పాఠశాల భవనం నిర్మిస్తే రోడ్డు విస్తరణకు ఆటంకం కలుగుతుందని అధికారులు సూచించడంతో మళ్లీ పనులను నిలిపివేశారు. పనులు నిలిచిపోయి నెలలు కావస్తున్నా అధికారులెవరూ ఈ సమస్యపై దృష్టి సారించడంలేదు. పాలకులు, అధికారులు చొరువచూపి భవనం నిర్మాణం జరిగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రమణీయం.. రథోత్సవం



ఆలయంలో యజ్ఞం చేస్తున్న భక్తులు



కోలాటం ఆడుతున్న మహిళలు

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామ సమీపంలో గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఆదివారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు స్వామి వారిని పల్లకీలో ఊరేగించి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, భక్తులు స్వామి వారి రథాన్ని తాళ్లతో లాగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు, ఈవో వేణు, కార్యదర్శి రఘు, ఎంపీటీసీ మంద సంజీవ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్‌గౌడ్, మిద్దె చిన్నయ్య, ఉప్పు సురేష్, దశరథ్, లింగన్న పాల్గొన్నారు.

రథం లాగుతున్న భక్తులు



అన్ని వర్గాలకు సమన్యాయం



రుద్రూర్‌లో రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న స్పీకర్ పోచారం

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేసేందుకు పలు పథకాలు అమలు చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్‌లో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు శిథిలావస్థకు చేరిన లక్ష్మీ వేంకటేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఆలయన పునః నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి నిధులు ఇప్పిస్తామని, అందుకు చేపట్టాల్సిన నిబంధనలు వివరించారు. అనంతరం పురగిరి క్షత్రియ పెరిక సంఘం భవనానికి భూమి పూజ చేశారు. రుద్రూర్‌లో ప్రతి కుల సంఘ భవనానికి నిధులు కేటాయించామన్నారు. కస్తూర్బా బాలిక విద్యాలయం భవనానికి రూ.4కోట్లు కేటాయించగా పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. రుద్రూర్‌లో స్పీకర్ చిన్నారులతో ముచ్చటించారు. ఎంపీపీ సుజాతనాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, విండో చైర్మన్ సంజీవరెడ్డి, డైరెక్టర్ రామ్‌రాజ్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు కన్నె రవి, వార్డు సభ్యుడు కన్నెరమేష్, తోట సంగయ్య పాల్గొన్నారు.

బకాయి వసూళ్లకు ప్రత్యేక బృందాలు

- రుణాల రికవరీకి ఎన్‌డీసీసీబీ చర్యలు
- రూ.124 కోట్ల బకాయిల వసూలే లక్ష్యం



మానాలలో రైతు ఇంటి ముందు వాగ్వాదానికి దిగిన బ్యాంకు అధికారులు

మోర్తాడ్: రుణ బకాయిలు భారీ మొత్తంలో పేరుకపోవడంతో నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు(ఎన్‌డీసీసీబీ) ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.124 కోట్ల బకాయిలు వసూలే లక్ష్యంగా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వివిధ సహకార సంఘాల ద్వారా రైతులకు ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి బకాయిలు పేరుకపోవడంతో వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహణ అనివార్యం అని బ్యాంకు పాలకవర్గం భావించినట్లు తెలుస్తుంది. నాలుగైదు మండలాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బకాయిదారుల ఇంటికి వెళ్లి ప్రైవేటు ఫైనాన్స్, బ్యాంకుల తరహాలో వసూళ్ల కోసం ఒత్తిడి చేస్తున్నారు. బ్యాంకు రుణం పొందడానికి తనఖా పెట్టిన ఆస్తులను వేలం వేసే అధికారం ఉన్నా రుణం ఇచ్చిన సమయంలో కొన్ని నిబంధనలను అనుసరించకపోవడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే బకాయిదారుల ఇళ్ల ముందు నిలబడి వసూళ్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని సమాచారం.

బడాబాబులను వదిలేస్తున్నారని ఆరోపణలు

సహకార బ్యాంకు శాఖలు, సహకార సంఘాల ద్వారా కొందరు బడా రాజకీయ నాయకులు గతంలో భారీ మొత్తంలో రుణాలను పొందారు. ఎన్నికల సమయంలో నో డ్యూ సర్టిఫికెట్ కోసం ఎంతో కొంత చెల్లించి మిగిలిన బకాయిలను అలాగే వదలేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు బడా బాబులను వదిలిపెట్టి సామాన్యులపైనే ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బకాయిల్లో దాదాపు 40 శాతం బడా బాబులవేనని, వారికి నోటీసులు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

రుణ బకాయిల వసూళ్ల విషయంలో ఉన్నతాధికారులు నిబంధనలను పాటించడం లేదని తెలుస్తుంది. బకాయిదారులకు డిమాండ్ నోటీసులను రెండు మార్లు జారీ చేయడం, అప్పటికి స్పందించకపోతే సహకార బ్యాంకు నిబంధనల ప్రకారం స్థిరాస్తి వేలం ప్రక్రియను మొదలు పెట్టడానికి నోటీసులు ఇవ్వాల్సి ఉంది. బకాయిదారులకు ఎలాంటి వెసులుబాటు ఇవ్వకుండా నేరుగా వేలం పాట నిర్వహించడానికి బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుంటుండటం వివాదాస్పదం అవుతోంది.

ఒకేలా వ్యవహరించాలి



జిల్లా సహకార బ్యాంకు బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుండగా బడా బాబులను వదలివేయడం, సామాన్యులపై ఒత్తిడి తీసుకు రావడం సరి కాదు. బకాయిదారులు అందరిపై ఒకే విధమైన ఒత్తిడి చేయాలి. ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయకపోవడం, సకాలంలో కిస్తీలు చెల్లించిన వారికి రిబేట్ ఇవ్వకపోవడంతోనే సహకార బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు బకాయిదారులుగా మారారు. ప్రభుత్వ తప్పిదాలకు రైతులను బలి చేయడం తగదు. – మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు

'సెకండ్ ఏఎన్‌ఎంలకు న్యాయం చేయాలి'





షబ్బీర్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు, వెంకటరమణారెడ్డికి..

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరణ కోసం కృషి చేయాలని ఏఐటీయూసి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డిలకు వినతి పత్రాలను అందజేశారు. తాము గత 18 ఏళ్ల నుంచి సెకండ్ ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తమను గుర్తించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యూలరైజేషన్, ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి షబ్బీర్ కాంగ్రెస్ ప్రతిపక్ష నేత బట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి సెకండ్ ఏఎన్‌ఎంలను సమస్యలను వివరించారు. రమణారెడ్డి కూడా వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, బాలరాజ్, ఎల్ దశరథ్, సెకండ్ ఏఎన్‌ఎంలు బి రేణుక, బి అంజలి, ఎం సుమలత, ఏ యాదమ్మ, శ్యామల, మంజుల, సుకన్య, కవిత, అలేఖ్య, బాలమణి, సరోజ, సుజాత తదితరలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ ఉన్నత పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతికి చెందిన 2002–03 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బ్యాచ్‌కు చెందిన వారిలో విజయ్‌కుమార్ గ్రూప్ 2లో ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం సాధించగా, సతీష్ అనే యువకుడు మిలిటిరీలో ఉద్యోగం సాధించి రిటైర్ కావడంతో వారిని సన్మానించారు. పూర్వ విద్యార్థులు మహేష్, వినోద్, లక్ష్మీ నారాయణ, రాజేష్ ఉన్నారు.



క్రైం కార్నర్

రైలు నుంచి పడి ఒకరి మృతి



మహ్మద్‌గౌస్ మృతదేహం

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూర్ రైల్వే గేటు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్‌లోని బహదూర్‌పూర్ పేట్ల బుర్జ్ ప్రాంతానికి చెందిన మహ్మద్‌గౌస్ (38) అజ్మీర్‌కు వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఆదివారం ఉదయం రైలులో బయలుదేరాడు. తలుపు దగ్గర నిలబడి ఉండగా అడ్లూర్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తావూనాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



రవీందర్ మృతదేహం

సదాశివనగర్: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామశివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటున్న వ్యాపారి జూలూరి రవీందర్(47) వ్యాపార నిమిత్తం కుప్రియాల్ గ్రామానికి తన స్కూటీపై వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చిన కారు వెనుక నుంచి స్కూటీని ఢీకొనడంతో రవీందర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మమత, ఇద్దరు కుమార్తెలు సహస్ర, సిరి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట రాజేశ్ తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని వెంకటేశ్వర టాకీస్ సమీపంలో గల శ్రీవర్షిని సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ శనివారం రాత్రి చోరీ జరిగింది. మున్సిపల్ సిబ్బంది ఉదయం రోడ్లు శుభ్రపరుస్తున్న సమయంలో శ్రీవర్షిని సెల్‌ఫోన్ దుకాణం షట్టర్ ధ్వంసమైనట్లు గుర్తించి దుకాణ యజమానికి సమాచారం అందించారు. యజమాని వచ్చి 8 సెల్‌ఫోన్లు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ఎడపల్లి: మండలంలోని జంలం గ్రామానికి చెందిన ఎర్రవల్లి గంగాధర్(40) ఆదివారం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గంగాధర్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలు, అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

రైలు కింద పడి ఒకరు..

సుభాష్‌నగర్: నగరంలోని లలితమహాల్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి (55–60 ఏళ్లు) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై ప్రణయ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



గట్టు రామచంద్రరావు, కవితను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ అధికారంలోకి రావాలంటే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని వైఎస్‌ఆర్‌టీపీ రాజకీయ కార్యచరణ కమిటీ సభ్యులు గట్టు రామచంద్రరావు, గడిపల్లి కవిత పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఆయా జిల్లాల అధ్యక్షులు బుస్సాపూర్ శంకర్, నీలం సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసం షర్మిల నాయకత్వంలో వైఎస్‌ఆర్‌టీపీ ఆవిర్భవించిందని, అధికారమే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన తెలంగాణలో రావాలంటే షర్మిలతోనే సాధ్యం అవుతుందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పుట్టిన పార్టీ అని అధికారమిస్తే కల్లిబొల్లి మాటలు చెప్పి కాలయాపన చేస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన బెట్టి సొంత ప్రయోజనాలను కాపాడుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని విమర్శించారు. అంతకుముందు రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి, బోధన్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ గౌతంప్రసాద్, నిజామాబాద్ రూరల్ కో ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు



నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేటలో దేవుడి ఆవుకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి, సీతారామచంద్ర స్వామి ఆలయం పేరిట మొక్కుగా వదిలిన ఆవు అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆవుకు భజన సంకీర్తనలతో అంత్యక్రియలు జరిపారు. నాయకులు సత్యనారాయణ, రమేష్‌కుమార్, శ్రీనివాస్ ఉన్నారు.